ప్రజాశక్తి
శుక్రవారం 6 జూన్ 2025   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ తమీమ్అన్సారియా, అధికారులు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయండి
- కలెక్టర్ తమీమ్అన్సారియా
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ప్రజాశక్తి-ఒంగోలు**

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పచ్చదనాన్ని పెంచడం, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఒంగోలు మినీస్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతలతో కలిసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య కారక ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలనే లక్ష్యంతో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక్క రోజే ఒక కోటి మొక్కలు నాటేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలో నాలుగు లక్షలా పది వేల మొక్కలు ఒక్కరోజే నాటేలా కార్యాచరణ రూపొందించామన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవటంపైనే మానవజాతి మనుగడ ఆధారపడి ఉందన్నారు. ఈ విషయాన్ని ఆనాడే అశోకచక్రవర్తి ▶ 2లో

# ఒకటీ..అర.. తప్ప..

- కేబినెట్‌లో జిల్లా కీలక అంశాల ప్రస్తావనేదీ?
- రైతులు రోడ్లెక్కుతున్నా పొగాకు సంక్షోభంపై చర్యలు శూన్యం
- ఏడాదిలో ఇచ్చిన హామీల్లో అమలు ఏమిటన్నదే ప్రశ్నార్థకం



**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

**ప్రతి నెలలో కేబినెట్ సమావేశం జరుగుతోంది. ఉమ్మడి ప్రకాశం నుంచి గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఇద్దరూ హాజరవుతున్నారు. అక్కడ ఎజెండాపైనే చర్చ సాగుతోంది. ఇద్దరు మంత్రులు ఉన్నందున జిల్లాలో కీలక అంశాల ప్రస్తావనేమైనా వస్తుందా? తెస్తారా? అనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. అయితే ఏడాదిలో ఒకటీ అర తప్ప జిల్లాలో ప్రధానమైన ఏ ఒక్కటీ అక్కడ చర్చసాగినట్లు కనిపించలేదు. ఇటీవల వెలిగొండ ప్రాజెక్టుకు రూ.106 కోట్లు కేటాయిస్తూ తీర్మానం కనిపించింది. ఇది తప్ప జిల్లాకు సంబంధించి ఒక్కటీ చర్చకు రాలేదు. ఇక విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ కనిగిరిలో రిలయన్స్ బయోఇంధన ప్రాజెక్టు, దొనకొండ వద్ద సోలార్‌ప్లాంట్‌ను ప్రకటించారు. ప్రతి సమావేశంలో రాష్ట్ర అంశాలే ఎజెండాలో ఉంటున్నాయి. మంత్రులు జిల్లాల్లో ఉన్న అంశాలను, హామీలను ప్రస్తావించే సాహసం చేయలేకపోతున్నారనే చర్చ సాగుతోంది. దీన్ని మంత్రులు అంగీకరించకపోవచ్చు. సాగుతున్న చర్చ మాత్రం ఇదే. ఎందుకంటే బుధవారం నాడు జరిగిన మంత్రివర్గ సమావేశంలో అమరావతి టవర్లు, తాగునీటి పథకాలకు నిధులు చెల్లింపులు వంటివే ఉన్నాయి.**

జిల్లాలో ప్రస్తుతం పొగాకు రైతులు రోడ్లెక్కుతున్నారు. వేలం కేంద్రాల వద్ద ధర్నాలు చేస్తున్నారు. గిట్టుబాటు ధరల్లేక అటు బర్లీ రైతులు, ఇటు వర్జీనియా పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. కారుచౌకగా వ్యాపారులు కాజేస్తున్నారు. నిత్యం రెండు వేలకు పైగా బేళ్లను తిరస్కరిస్తున్నారు. సగటు ధర కూడా పడిపోతోంది. బర్లీ పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పొగాకు సంక్షోభంపై కేబినెట్‌లో ప్రస్తావనే లేదు. ఇద్దరు మంత్రులు ఉండి కూడా ఈ అంశాన్ని చర్చకు పెట్టలేకపోయారు. యోగాపై ఉన్న శ్రద్ధ పొగాకు రైతులపై లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొగాకు అంతర్జాతీయ వాణిజ్య పంటగా ఉంది. మార్కెట్‌లో సంక్షోభం సృష్టించింది ఐటీసీ. దానిపై నియంత్రణ లేదు. మంత్రులు వచ్చి బర్లీ పొగాకు రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. పొగాకును కొనాల్సిందేనని వ్యాపారులకు హెచ్చరిక చేశారు. ఏ మార్పు లేదు. ఇంతటి కీలకమైన అంశాన్ని కేబినెట్‌లో చర్చిస్తే వ్యాపారులకు భయం వస్తుంది. మంత్రుల మాట వింటారు. అలా కాకుండా మొక్కుబడిగా వ్యవహరిస్తే ఫలితం ఉండదు. ఇదే జరుగుతోంది. ఇంకా అనేకం పెండింగులో ఉన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకాలేదు. వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీలు రాలేదు. దాని పనులూ నత్తనడకన సాగుతున్నాయి. మార్కాపురం ▶ 2లో

## పని గంటల పెంపు..

# కార్మికుల నడ్డి విరిచేందుకే..

- ఎనిమిది గంటల పనిదినాల రద్దును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- పలు చోట్ల కార్మికుల ధర్నా



ఒంగోలులో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**ప్రజాశక్తి-చీరాల**

కార్మికుల నడ్డి విరిస్తూ వారి హక్కులను కాలరాసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పనిదినాల గంటలను పెంచుతూ కక్షపూరిత ఆలోచనలు చేసిందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు అన్నారు. గురువారం సిఐటియు చీరాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌లో భాగంగానే రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిదినాన్ని రద్దు చేసింద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసు కొచ్చిన 10 గంటల పని దినం రదయ్యే వరకు కార్మిక వర్గం పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షుడు ఎన్ బాబూరావు, పి. కాలేషా, గేరా క్రాంతిసాగర్, జి. ఇమ్మానియేలు, సిఐటియు నాయకులు బొల్లా రాంబాబు,బి వెంకటేశ్వర్లు, కే పోతురాజు, గూడూరు కోటేశ్వరి, బందు ఏసమ్మ, జి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.




చీరాలలో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

### 10 గంటల పని విధానం వద్దు..

**ఒంగోలు సిటీ:** కార్మికవర్గంపై దాడి చేస్తూ పది గంటలకు పని గంటలు పెంచుతూ తీసుకున్న మంత్రివర్గ నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్( సిఐటియు) డిమాండ్ చేసింది. గురువారం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి బస్టాండ్ వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో బి అరుణ, కే శ్రీదేవి, ఎస్ కోటేశ్వరరావు, సిహెచ్ అక్కేశ్వరరావు, డి వెంకట్రావు, కె.మరియమ్మ, పి కోటేశ్వరరావు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# 11న పొదిలిలో జగన్ పర్యటన.!

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న పొదిలి పర్యటనకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలో పండించిన పొగాకుకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్న రైతుల కష్టం తెలుసుకునేందుకు గత నెల 28న పొదిలి వేలం కేంద్రం సందర్శించి రైతులతో చర్చించడానికి పర్యటన ఖరారు చేశారు. వాతావరణ అననుకూల పరిస్థితుల్లో, హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు వాతావరణం సానుకూలంగా లేనందున చివరి నిమిషంలో ఆ కార్యక్రమం రద్దయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఈ నెల 11న ప్రకాశం జిల్లా, పొదిలికి పొగాకు రైతుల కష్టాలు తెలుసుకొనేందుకు వస్తారని సమాచారం.

# జులైలో పవన్‌కల్యాణ్ రాక..

- పి-4 మార్గదర్శిల నమోదులో జిల్లాకు ప్రథమ స్థానం
- కలెక్టర్ వెంకటమురళి



కలెక్టర్ వెంకటమురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మడ అడవుల మొక్కలు నాటడానికి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జులైలో బాపట్ల జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెప్పారు. ఐటిసి కంపెనీ 80 వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుండగా, ఆ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. పి-4, యోగాంధ్ర, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పి-4 మార్గదర్శిల నమోదులో బాపట్ల జిల్లా 60 శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. మార్గదర్శిలతో గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి పి-4 అమలుపై ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. మార్గదర్శిలు, బంగారు కుటుంబాలను అనుసంధానిస్తూ గ్రామ స్థాయిలో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. బల్లికురవ, ▶ 2లో

# ఒకటీ..అర తప్పు..

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా హామీ ఎండమావిగానే ఉంది. దీనిపై పాలకపక్ష ఎమ్మెల్యేల్లోనే చర్చ సాగుతోంది. ఎవరు మాట్లాడినా సిఎం చంద్రబాబు ఏమంటారోనన్న భయం కూడా వెంటాడుతోంది. జిల్లాకు వచ్చినప్పుడు ప్రస్తావించినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా డెయిరీ సంగతీ పక్కనబెట్టేశారు. నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీలు ఎక్కడున్నాయో స్పష్టత లేదు. పదుల సంఖ్యలో ఉన్నాయి. వాటిపై చర్యలు లేవు. నిధులు లేవు. కార్యాచరణ లేదు. ఏడాదిగా ఏం చేశారనే చర్చ తాజాగా తెరపైకి వస్తోంది. పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, గ్యాస్ సిలిండర్ల పథకం మాత్రమే అమలులోకి వచ్చాయి. ఏడాదిగా చెప్పుకునేవి ఇవే. మరో వైపు ఫలితాల రోజునే వెన్నుపోటు దినంగా వైసిపి జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. తెలుగుదేశం నేతలు ఎదురుదాడి తప్ప ఆచరణలో ఏం చేశామన్న దానిపై వివరణ లేదు. అభివృద్ధిపై చర్చ లేదు. జగన్‌పైనే నేరుగా మాటల దాడి చేశారు. ఇదంతా వ్యూహాత్మకం. ఇక ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటేస్తారంటూ సెల్‌ఫోన్లలో సర్వేల గోల పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేల పనితీరుపైనా సర్వే చేపట్టింది. ఎమ్మెల్యేల గ్రాఫ్ బాగా పడిపోయిందని సమాచారం. కేబినెట్‌లోనూ దీనిపై చర్చ సాగినట్లు సమాచారం. అయితే ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎమ్మెల్యేల పనితీరు ఎలా మెరుగుపడుతుందో ఆలోచించాలి. నియోజకవర్గాల్లో నిధుల్లేకుండా ఎమ్మెల్యేలు ఏం చేస్తారన్నదే ఆలోచించాలి. ఏ పనులు చేపట్టాలన్నా నిధుల్లేనందున మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఏం చేయాలో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులకూ ఏమీ చెప్పలేకపోతున్నారు. గతంలో ఇదే జరిగినందున వైసిపి ఎన్నికల్లో ఘోరపరాజయం పొందింది. ప్రభుత్వం పనితీరు బాగుంటే ఎమ్మెల్యేలకూ మంచిపేరు వస్తుంది. ఎన్నికల మేనిఫెస్టోపై ఏడాదిగా నాన్చుడే జరుగుతోంది. పథకాలు ఆగిపోయాయనే చర్చ పేదల్లో పెరిగింది. మహిళలకు నెలకు రూ.1500, ప్రతి విద్యార్థికీ అమ్మఒడి పథకం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటివి మహిళలను బాగా ఆకట్టుకున్నాయి. ఏదేమైనా రెండో ఏడాదిలోనైనా పాలన పరుగులు తీయాలని ఆశిద్దాం.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించి రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించారన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో ఈ సందర్భంగా కలెక్టర్, ఇతర అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎఫ్ఒ సోషల్ ఫారెస్ట్ రాజశేఖర్, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, స్టెప్ సిఈఒ శ్రీమన్నారాయణ, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**కేంద్రీయ విద్యాలయలో..**

స్థానిక కేంద్రీయ విద్యాలయంలోనూ కలెక్టర్ మొక్కలు నాటారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' (తల్లి పేరుతో ఒక మొక్క ) నినాదంతో కలెక్టర్‌తో కలిసి విద్యార్థులు కూడా మొక్కలు నాటారు. ప్రకాశం భవనం ప్రాంగణంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు, డిఎస్ఒ పద్మశ్రీ, పరిపాలన అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఇతర ఉద్యోగులు మొక్కలు నాటారు.

# జులైలో పవన్‌కల్యాణ్ రాక..

(మొదటిపేజీ తరువాయి)

జె.పంగులూరు మండలాలలో నూరు శాతం మార్గదర్శిల నమోదు పూర్తి చేయడంపై సదరు అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సిపిఓ శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్, డ్వామా పిడి విజయలక్ష్మి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసి నాగిరెడ్డి, డిఇఓ పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవ కార్యక్రమానికి ఫారెస్ట్ అధికారులు గైర్హాజరైనందున కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేస్తున్నానని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఉపాధి హామీ పథకం కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోషల్ ఫారెస్ట్ అధికారులు కార్యక్రమంలో పాల్గొనక పోవడం దారుణమన్నారు. గత కొన్నేళ్లుగా వైసిపి నాయకులతో సోషల్ ఫారెస్ట్ అధికారులు కుమ్మక్కై కోట్లాది రూపాయలు పనులు చేస్తున్నారన్నారు. ఇటీవల మార్కాపురంలో పని చేస్తున్న సోషల్ ఫారెస్ట్ అధికారులు డిస్మిస్ అయిన సంగతి విధితమే. వారు ఇంకా వైసీపీ నాయకులను విడవలేకపోతున్నారన్నారు. అధికారుల పని తీరులో మార్పు రాకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. మండలంలో ఎవరి పింఛన్లనూ తొలగించొద్దని అధికారులకు, నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఏపీఓ బులెరావ్, ఏపీఎం సుధాకర్‌రావు, ఇఓఆర్‌డి శ్రీదేవి, పశు వైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి, మండల టిడిపి కన్వీనర్ బాబురావు, బిసి సెల్ నాయకులు అంకాల రోశయ్య, గొట్లగట్టు సర్పంచ్ సుఖదేవ్, నాయకులు కుడుములు లక్ష్మిరెడ్డి, పాసపతి నాయుడు, పరిటాల సుబ్బయ్య, మువ్వా కాటమరాజు, మాజీ సర్పంచ్‌లు రమణారెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పందిటి తిమోతి, భీమాంజనేయరెడ్డి, గురవయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


# దుకాణాలు మూసి నాయీ బ్రాహ్మణుల నిరసన

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ పిలుపు మేరకు గురువారం మండలంలోని సెలూన్ క్షౌరవత్తి దారులు షాపులను మూసి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ నియోజక వర్గ కన్వీనర్ కరేటి నరసింహారావు మాట్లాడుతూ సెలూన్ వృత్తి నాయీ బ్రాహ్మణులు మాత్రమే చేసుకునేలా జీవో వస్తేనే ఇతరుల చొరబాటు ఆగుతుందన్నారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ, జిల్లా బిసి సమన్వయ కమిటీ కన్వీనర్ గుంటూరు మస్తాన్ రావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకేశ్వరం గోవిందు, ఒంగోలు పట్టణ నాయి బ్రాహ్మణ అధ్యక్షులు అయ్యప్ప, సంతనూతలపాడు మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల ఉపాధ్యక్షులు గుంటూరు పిచ్చయ్య, జనరల్ సెక్రటరీ మద్దులూరి ప్రసాదు, మాజీ మండల అధ్యక్షులు గుంటూరు ప్రసాదు, మండల సెలూన్ వర్కర్స్ ఉపాధ్యక్షులు ఏల్చూరి రాఘవేంద్రరావు, నాయి బ్రాహ్మణులు వెంకట శేషయ్య, గుంటూరు వెంకటేశ్వర్లు, కొచ్చర్ల శీను తదితరులు పాల్గొన్నారు.



షాపులను మూసివేసి నిరసన తెలియజేస్తున్న దృశ్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

# నూతన వధూవరులకు శిద్దా ఆశీర్వాదం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

స్థానిక వాసవి కళ్యాణ మండపంలో జరిగిన శిద్దా వెంకటేష్, అనురాధల వివాహ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో శిద్దా సాయిబాబు, శిద్దా వెంకట ఆంజనేయ ప్రసాద్, పల్లపోతు వెంకట రమణారావు, శ్రీ లక్ష్మీ దంపతులు, పల్లబోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు తగ్గిన కనిష్ట ధర

**ప్రజాశక్తి-కొండపి:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కనిష్ట ధర కేజీ రూ.185 పలకగా, గురువారం నిర్వహించిన వేలంలో మరొక ఐదు రూపాలు తగ్గి 180 పలికింది. గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర కేజీ రూ.180 పలికిందని ఇంచార్జ్ వేలం నిర్వహణ అధికారి ఎం.సత్య శ్రీనివాస్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 705 బేళ్లను తీసుకొని వచ్చారు. అందులో 527 బేళ్లు కొనుగోలుయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 178 బేళ్లను తిరస్కరించారు.పొగాకు గరిష్ట ధర కేజీ రూ 280, సరాసరి ధర కేజీ రు 251.10గా నమోదయింది.

# ఆలయంలో బూచేపల్లి పూజలు

**ప్రజాశక్తి-దర్శి:** మండలంలోని శేషంవారిపాలెంలో నూతనంగా సీతారాముల గుడి ప్రతిష్ట మహోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

# స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

**ప్రజాశక్తి-పామూరు**

అదానీ స్మార్ట్ మీటర్లను బిగించడం దుర్మార్గపు చర్యల అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒక్కో మీటరుకు రూ.10 వేల నుంచి రూ.13 వేల ఖర్చు చేసి మీటర్ బాడుగ పేరుతో బిల్లులో కలిపి వినియోగదారుల నుంచి దశలు వారీగా ఈ మొత్తాన్ని వసూలు చేస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు రెండు కోట్ల గృహ వినియోగ కనెక్షన్లు ఉండగా, బాగున్న మీటర్లు తీసి అదానీని బాగు చేయడం కోసం సుమారు 25 వేల కోట్ల రూపాయలను దోచిపెట్టడడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమయ్యిందన్నారు.

# పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

మండలంలోని మాచవరంలో పోలేరమ్మ తల్లి దేవస్థానంలో గురువారం వైభవంగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలుకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి-కనిగిరి**

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎఎంసి ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఎఎంసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏఎంసి ఉద్యోగులు జిలాని, ఫిరోజ్, రమేష్, లక్ష్మయ్య, మల్లికార్జున, రఫీ పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి- సిఎస్పురం రూరల్**

మండల కేంద్రమైన సీఎస్‌పురంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ షేక్ రసూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి ఫీడర్‌లో సమస్యలను సరి చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ప్రజాశక్తి
శుక్రవారం 6 జూన్ 2025



# 'వెన్నుపోటు దినం' నిర్వహించడం సిగ్గుచేటు

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెన్నుపోటు దినం నిర్వహించడం సిగ్గు చేటని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎద్దేవ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెన్నుపోటు అంటే జనం నవ్వుకుంటున్నారన్నారు. సొంత బాబాయి వివేకానందరెడ్డిని గొడ్డలిపోటుతో కాజేశారన్నారు. ఈ విషయం ప్రజలు మర్చి పోలేదన్నారు. మార్కాపురం పట్టణంలోని ఆక్రమణల తొలగింపులో అవినీతి జరిగిందని వైసిపి నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. తాము తప్పులు చేయబోమన్నారు. వైసిపి నేతలు చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయన్నారు. అధికారులపైనా మండిపడటం ఏమిటన్నారు. మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డిని కూడా దూషిస్తున్నారని, గత వైసిపి ప్రభుత్వంలో సుమారు రూ.200 కోట్ల అవినీతి చెన్నకేశవస్వామి భూములలో జరిగిందని ఆరోపించారు. దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం తాము చేసిన తప్పా అని ప్రశ్నించారు. చివరకు రెవిన్యూ శాఖలో గోడౌన్ డీటీలను సైతం విమర్శిస్తున్నారన్నారు. రేషన్ షాపుల్లో తప్పులు చేస్తే కేసులు నమోదు చేయడం వారి విధి అన్నారు. ఇసుకలో ఏదో జరుగుతుందని వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారని, గత వైసిపి ప్రభుత్వం రూ. 1500 లకు టన్ను ఇసుక అమ్మితే, ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో రూ. 1200 లకు ఇసుక అందిస్తున్నామని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రజా సమస్యలపై రోడ్లు ఎక్కితే చివరకు జైల్లో వేసి హింసించారని ఆరోపించారు. ఇప్పటికైనా వైసిసి నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. విలేకరుల సమావేశంలో వక్కలగడ్డ మల్లికార్జునరావు, మాలపాటి వెంకటరెడ్డి, తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ, పఠాన్ ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పరిశీలన

**ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్**

ఉపాధి హామీ పథకం పనులలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వాణి హెచ్చరించారు. మండలంలోని కే అగ్రహారంలో పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకట్రావు పాల్గొన్నారు.

## బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ రజియా సుల్తానా సూచించారు. గురువారం నాగులుప్పలపాడు మండల పరిధిలోని ముస్లిం మతపెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మసీదు ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని కోరారు.

## ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

**ప్రజాశక్తి-కొత్తపట్నం**

కొత్తపట్నం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకులు సి.హెచ్.అజయ్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

## పీసీపల్లి ఎంపీడీవోగా హనుమంతరావు

**ప్రజాశక్తి-పీసీపల్లి**

పీసీపల్లి ఎంపీడీవోగా ఎన్‌వీఎల్ హనుమంతరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న ఓ ప్రభాకర్ శర్మ కనిగిరికి బదిలీ కావటంతో ఆయన స్థానంలో హనుమంతరావు సోమవారం విధుల్లో చేరారు.

## పొందుగుల శ్రీనివాసరెడ్డికి నివాళి

**ప్రజాశక్తి-పెద్దారవీడు**

మండలంలోని సానికవరం గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరుడు, రైతు సంఘం నాయకుడు పొందుగుల శ్రీనివాసరెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం శ్రీనివాసరెడ్డి సంతాప కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సానికవరం గ్రామ శాఖా కార్యదర్శి గోపిదేశి మల్లయ్య మాట్లాడారు. శ్రీనివాసరెడ్డి ఎర్రజెండా అభిమాని అన్నారు. సిపిఎంకు పూర్తి సహకారం అందించారన్నారు. శ్రీనివాసరెడ్డి సేవలను, సహకారాన్ని మరువలేమని కొనియాడారు. అనంతరం శ్రీనివాసరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం సభ్యులు దొడ్డా సుబ్బారెడ్డి, ఓ. వీరారెడ్డి, గంగవరపు శ్యాంబాబు తదితరులు ఉన్నారు.

# మట్టి పరీక్షలు చేయించుకోవాలి

**ప్రజాశక్తి-పొదిలి**

రైతులు పంటలు వేసే ముందు పచ్చి రొట్ట ఎరువు వేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని బాపట్ల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలోని సూధనగుంట, తుమ్మగుంట గ్రామాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఫ్రీ ఖరీఫ్ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దర్శి కేవీకే నోడల్ ఆఫీసర్ కే సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక గ్రామంలో ఆర్ బి కే ద్వారా మట్టి నమూనాలు సేకరించి ఉచితంగా పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతుల వినియోగించుకోవాలని ప్రభుత్వ ఇచ్చే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పంటల వేసే ముందు శాస్త్రవేత్తలను సంప్రదించాలని, సాంకేతికంగా అభివృద్ధి చెందిన డ్రోన్ టెక్నాలజీ కూడా వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ కోళ్ల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.ప్రకాష్ మాట్లాడుతూ కోళ్లలో రకాలు, వాటి పోషక విలువలు, కోలల వచ్చే వ్యాధుల నివారణ మార్గాల గురించి వివరించారు. కొన్ని రకాల కోళ్లు పెంచడం వల్ల మహిళా రైతులు ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. పొదిలి మండల వ్యవసాయ అధికారి ఎస్కే జైనులాబ్దిన్ మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్తగా వచ్చిన యాప్ల ద్వారా పంటల యొక్క సరళి తెగుళ్ల దశలను నిర్ధారించి సరైన సమయంలో మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె వి కె సిబ్బంది జిల్లా అనుబంధ శాఖల అధికారులు రైతులు మహిళలు పాల్గొన్నారు.

# సీఎస్‌పురంలో ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

**ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్**



ఎడ్లపోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

సీఎస్‌పురంలోని ఒడియరాజుల నగర్‌లో రాచూరి పెద్దమ్మ తల్లి తిరుణాళ్ల వేడుకలు గురువారం ముగిశాయి. చివరి రోజైన గురువారం పొంగళ్లు, గండ దీపాలు మోయు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు, రెడ్ల ఆధ్వర్యంలో గుర్రం ఎక్కే కార్యక్రమం, కమ్మ నాయుళ్ళ ఆధ్వర్యంలో మొదటి పూసల బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. బోయళ్ళ ఆదిరెడ్డి గుర్రం ఎక్కి ఊరేగారు. ఈ సందర్భంగా కాపు నాయుళ్ళు, రెడ్లు, యాదవ రాజులు, కమ్మ నాయుడ్లు ఆధ్వర్యంలో విడివిడిగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.

బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. కదిరి ప్రకాష్ రావు, పాలుగుళ్ళ మల్లికార్జున రెడ్డి, ఆమంచి స్వాములు ఈ పోటీలను ప్రారంభించారు. పెద్ద కొటాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లు ప్రథమ స్థానం, కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎడ్లు ద్వితీయ స్థానం, కడప జిల్లా రంగసాయిపల్లికి చెందిన మార్థల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు తృతీయ స్థానం, నంద్యాల జిల్లా హుస్సేన్ పురం గ్రామానికి చెందిన రామ సుబ్బారెడ్డి ఎడ్లు నాలుగో స్థానం, బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లు ఐదవ స్థానం, నంద్యాల జిల్లా, జిల్లేలకు చెందిన గొట్టిక దినేష్ రెడ్డి ఎడ్లు ఆరో స్థానం, అనంతపురం జిల్లా, గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు ఎడ్లు ఏడో స్థానంలో నిలిచాయి. డాక్టర్స్ ఫార్మసీ యం.డి డాక్టర్ చలమయ్య నాయుడు, పలువురు సహకారంతో విజేతలకు బహుమతులు అందజేశారు. సంగిశెట్టి బ్రదర్స్ సహకారంతో అన్నదానం చేశారు. మారెళ్ళ రవికుమార్, గూడంశెట్టి రవికుమార్ సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

**ప్రజాశక్తి-కనిగిరి**



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కనిగిరి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పర్యావరణం పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఖాజా రెహ్మాన్, టిడిపి నాయకులు మస్తాన్ బాబు పాల్గొని ప్రసంగించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

## యోగాతో శారీరక సామర్థ్యం

**ప్రజాశక్తి-కొండపి**

యోగా శారీరిక సామర్థ్యాన్ని పెంచుతుందని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. యోగాంధ్రాలో భాగంగా గురువారం మండలంలోని కే.ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగ ఎంతో ముఖ్యమని ప్రతిరోజు యోగా చేయడం వలన మనిషి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. యోగ శిక్షకుడిగా హైస్కూల్ పీడీ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రామారావు, కే.ఉప్పలపాడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-కొమరోలు**

విద్యుత్ షాక్తక వ్యక్తి మృతి చెందిన సంఘటన కొమరోలు మండలం ఓబులాపురంలో జరిగింది. ఓబులాపురం గ్రామానికి చెందిన పిట్టల నాగేశ్వరరావు (40) వివాహ శుభకార్యాలకు విద్యుత్తు లైట్లతో డెకరేషన్ చేస్తుంటాడు. గురువారం ఓబులాపురం గ్రామంలో జరుగుతున్న ఒక శుభకార్యానికి విద్యుత్తులైట్ల డెకరేషన్ చేస్తుండగా నాగేశ్వరరావు విద్యుత్ శాఖ గురై మృతి చెందాడు. కొమరోలు ఎస్ఐ నాగేశ్వరరావు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్**



లభ్యమైన మృతదేహం

మండలంలోని ముండ్లపాడు సమీపంలో గుర్తుతెలియని మృతదేహన్ని గుర్తించినట్లు ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపారు. సీఎస్‌పురం నుంచి ముళ్లపాడు వెళ్లే దారిలో నూ తనంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు బ్రిడ్జి కింద దాదాపు 70 సంవత్సరాలు వయసు కలిగిన మగ వ్యక్తి మృతదేహం లభ్యమైందన్నారు. వీఆర్వో బాల కాశయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యాశాలకు తరలించినట్లు చెప్పారు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి సమాచారం తెలిస్తే ఎస్ఐ 9121102216, పామూరు సిఐ 9121102214 నెంబర్లలో తెలియజేయాలన్నారు.

## టీడీపీ నాయకుడు చిన్ని మృతి బాధాకరం

**ప్రజాశక్తి-సిఎస్ పురం**

సీఎస్‌పురం పట్టణానికి చెందిన ప్రముఖ టిడిపి నాయకులు మన్నేపల్లి చిన్ని మృతి బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, మన్నేపల్లి శ్రీనివాసులు, చెరుకుపల్లి వెంకటరెడ్డి, బొబ్బురి రమేష్ పాల్గొన్నారు.

## తన భూమిని కాపాడాలని ధర్నా

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

తనకు చెందిన భూమిని వేరే వ్యక్తి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని చేబ్రోలు ఇస్సాకు కుటుంబసభ్యులతో గురువారం కొనకనమిట్లలో ధర్నా చేపట్టారు. ఈ విషయాన్ని కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానని చేబ్రోలు ఇసాక్ తెలిపారు. విచారించి నాకు న్యాయం చేయాలని ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టానని విలేకరులతో అన్నారు. గురువారం కొనకనమిట్ల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానని చేబ్రోలు ఈసాకు తెలిపారు.




గ్రామస్థులను విచారిస్తున్న తహశీల్దార్

## రేషన్ డీలర్ అక్రమాలపై విచారణ

**ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్**

రేషన్ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారని వచ్చిన ఆరోపణపై తహశీల్దార్ పి.వెంకటేశ్వర్లు గురువారం విచారణ చేపట్టారు. మండలంలోని ఆనికాలపల్లి గ్రామానికి చెందిన రేషన్ షాప్ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై గురువారం తహశీల్దార్ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. సర్పంచ్ రాధాకృష్ణారెడ్డిని గ్రామంలోని పలువురు రేషన్ లబ్ధిదారులను విచారించారు. రేషన్ షాపులోని స్టాక్‌ను పరిశీలించగా 50 కేజీలు బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించారు. విచారణ నివేదికను ఆర్డీవోకు పంపించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, వీఆర్వోలు కాజా రఫీ, జాన్ లిసిలు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**ప్రజాశక్తి - గిద్దలూరు**

నియోజకవర్గంలోని 55మంది లబ్దిదారులకు రూ 56,78,882 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎంఎల్ఎ ఎం అశోక్‌రెడ్డి గురువారం పంపిణి చేశారు. స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,54,04,648 అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచి ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.


రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

## రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం

**ప్రజాశక్తి - పంగులూరు**

వ్యవసాయంలో అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న రైతు తల్లపనేని శ్రీనాథ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఆ కుటుంబానికి కావలసిన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. రైతు ఉత్పత్తులకు ప్రభుత్వం ధర కల్పించి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతుందని అన్నారు. మండలంలోని జనకవరంలో శ్రీనాథ్ కుటుంబ సభ్యులను కలిసి ఆయన గురువారం పరామర్శించారు. శ్రీనాథ్ భార్య వందనతో మాట్లాడుతూ కుమారుడు కార్తీక్ వయసు చిన్నదవడం వలన మరో రెండేళ్ల ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పాఠశాల్లో చేర్పిస్తామని, అప్పటి వరకు వారికి కావలసిన సహాయాన్ని అందిస్తామని అన్నారు. సొంత ఇల్లు గాని, సొంత స్థలం కానీ లేకపోవడం వలన ఆ కుటుంబానికి ఇల్లు కట్టించే ఏర్పాట్లు చూస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు కొండమూరు గ్రామంలో ఇటీవల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మరణించిన సంపెంగల వెంకటరావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మున్ముందు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సంపెంగల శేషమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఈరోజు దశదిన కార్యక్రమం సందర్భంగా మంత్రి గొట్టిపాటి హాజరై శేషమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కోవూరు మంగమ్మ అనారోగ్యంతో ఇటీవలే మరణించగా ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈనాడు విలేఖరి కోరుకొండ వెంకటేశ్వర్లు తల్లి పద్మ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మరణించగా వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. చందలూరులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన చిత్తాబత్తిన సారధి, రాయపాటి హరిబాబు, సోడా బసవచారి దశదిన కార్యక్రమాల సందర్భంగా వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చందలూరులో పెంట్యాల జగబాబు కుమారుడు వివాహం సందర్భంగా ఈరోజు వారి ఇంటికి వెళ్లి నూతన వరునికి మంత్రి గొట్టిపాటి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో టిడిపి నాయకులు రావూరి రమేష్ బాబు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, కెవి సుబ్బారావు, కుక్కపల్లి ఆంజనేయులు, గుర్రం ఆదిశేకర్, వలపర్ల సుబ్బారావు, గుదిబండ్ల ఆదిరెడ్డి, గరిమిడి జగన్మోహనరావు పాల్గొన్నారు.

# అదనపు పనిగంటల భారం తగ్గించాలి



సిఐటియు ఆధ్వర్యంలో అద్దంకిలో నిరసన

**ప్రజాశక్తి - అద్దంకి**

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని, 8గంటల పని దినాన్ని 10 గంటల పనిదినంగా మార్పు చేయటాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, మున్సిపల్ వర్కర్స్, ఫ్రూట్ టెండర్స్, ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

**రేపల్లె :** ఏడాది గడిచిన ప్రభుత్వం నిన్న మంత్రివర్గంలో పెట్టుబడిదారులకు లాభం చేసేలా కార్మికుల పనిగంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద సిఐటియు నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులపై దాడి చేస్తుంటే అదేబాటలో కూటమి ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో కార్మిక లోకంపై పెనుదాడి చేసిందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు యు రామకృష్ణ ప్రసాద్, డి ప్రభాకరరావు, కె రమేష్, యు వాసు, వి సుబ్బారావు, బి నాగరాజు, పి విజయ్ పాల్గొన్నారు.

**బాపట్ల :** కార్మిక హక్కులు కాలరాసే చట్టాలను వెంటనే రద్దు చేయాలని సిఐటియు నాయకులు కె శరత్ డిమాండ్ చేశారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఓ లక్ష్మణ్, నాయకులు సాల్మన్ రాజు పాల్గొన్నారు.


రేపల్లెలో నిరసన తెలుపుతున్న సిఐటియు కార్మికులు


బాపట్లలో సిఐటియు నిరసన ర్యాలీలో శరత్

## 'నల్లబర్లీ' కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి..

**ప్రజాశక్తి - పంగులూరు**

మండల కేంద్రమైన పంగులూరు మార్కెట్ యార్డులో నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు రైతులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని చందలూరులో గురువారం పర్యటించిన ఆయనను పలువురు పొగాకు రైతులు కలిశారు. మండలంలో సుమారు 43వేల క్వింటాళ్లకుపైగా నల్లబర్లి పొగాకు నిల్వలు రైతుల ఇళ్ల దగ్గర ఉన్నాయని తెలిపారు. పంగులూరులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని కోరారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడు తూ పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు ప్రాంతాల్లో అధికంగా పొగాకు నిల్వలు ఉన్నందువల్ల ఆ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పంగులూరు పరిసర ప్రాంత రైతులు తమ పొగాకు నిల్వలను విక్రయించుకునేందుకు అనువుగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు అడ్డగడ సతీష్, అడ్డగడ సుబ్బయ్య, కర్రి వెంకట సుబ్బారావు, రావూరి రమేష్ బాబు, ఎన్టీఆర్ వెంకటేశ్వర్లు, నార్నె శ్రీనివాసరావు, కుక్క పల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.


చందలూరులో మొక్క నాటుతున్న మంత్రి గొట్టిపాటి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని చందలూరులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె స్వరూపరాణి, ఎపిఒ కె సంతోషం, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎఇ శివయ్య, ఈఓఆర్డి సుమంత్, పిఆర్ఎఈ గడ్డం హనుమంతరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాయల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**


ఓబులుశెట్టి దిలీప్


బద్దేటి అనూహ్య

ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభ అవార్డులకు మార్టూరు రాయల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఎంపిక అయ్యారు. గురువారం ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో రాయల్ జూనియర్ కాలేజీకి చెందిన సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి ఓబుల్ శెట్టి దిలీప్ జిల్లా స్థాయిలో 989, సీఈసీ విభాగంలో బద్దేటి అనుహ్య 964 మార్కులు సాధించి ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ వీరగంధం శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు రూ.20వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెడల్ అందజేస్తారని తెలిపారు. ఇరువురు విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**ప్రజాశక్తి - నగరం**


పాలెం గీతిక


కేశన జయలక్ష్మి

10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభ అవార్డులను మండలంలోని ఈదుపల్లి పంచాయతీలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఎంపిక అయ్యారు. పాఠశాల విద్యార్థినిలు పాలెం గీతిక 589, కేశన జయలక్ష్మి 5 83 మార్కులు సాధించి ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ యోనో బాబు తెలిపారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థులకు రూ.20 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెడల్ అందజేస్తారని తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి గొట్టిపాటి

## మంత్రి గొట్టిపాటి ఆశీర్వాదం

**ప్రజాశక్తి - మేదరమెట్ల**

కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చాట్ల శేఖర్, ఏసుమ్మ దంపతుల కుమారుడు డాక్టర్ భార్గవ్, డాక్టర్ రాణి వివాహం మేదరమెట్లలోని ఎస్‌బి ఫంక్షన్ హాల్లో గురువారం జరిగింది. ఈ వేడుకకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో టిడిపి నాయకులు జయకృష్ణ, చెన్నుపాటి హరిబాబు, కారుసాల నాగేశ్వరరావు, రామినేని రమణ, డాక్టర్లు హృదయనాథ్, అనపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రొడిజి విద్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీ కృష్ణ ప్రసాద్

## విద్యారంగంలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి

**ప్రజాశక్తి - బాపట్ల**

విద్యారంగంలో పోటీ తత్వాన్ని తట్టుకోవడానికి సిబిఎస్‌ఈ విద్యా విధానంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. సూర్యలంక రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొడిజి విద్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఉత్తమ విద్య, అత్యుత్తమ సౌకర్యాలతో ప్రశాంతమైన వాతావరణంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రొడిజి విద్యాలయం చైర్మన్ శ్రీనివాసరావు, డిఇఒ పురుషోత్తం, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, రైల్వే అడ్వైసరీ బోర్డు సభ్యులు పఠాన్ రాజేష్, ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, విద్యాలయ డైరెక్టర్లు చింతకాయల పార్థసారథి, పెదమల్లు ఉదయ్ చంద్రరావు, మాంటిస్సోరి మాస్టర్ ట్రైనర్ సూర్య కుమారి, ప్రిన్సిపాల్ సింధూర పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

## పర్యావరణాన్ని కాపాడుకుందాం

**ప్రజాశక్తి - చీరాల**

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకుందామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మొక్కల పెంపకం అందరి బాధ్యతని, ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దామని వివరిస్తూ ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన భూమి, వాతావరణం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం బాధ్యతగా చేయాలని అన్నారు. అడువులు, వృక్ష సంపద కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పర్యావరణానికి హానీ కలిగించే పారిశ్రామిక కాలుష్యం నివారించాలని అన్నారు. కార్యక్రమంలో జెవివి డివిజన్ కార్యదర్శి మాల్యాద్రి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె వీరాంజనేయులు, జి సూరిబాబు, వీరప్రసాద్, జెవివి టౌన్ అధ్యక్షులు హేమంత్, యుటిఎఫ్ ఎయిడెడ్ కన్వీనర్ కుర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి**



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

**ప్రజాశక్తి-పామూరు**

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట పాటి జనార్దన్ అన్నారు. బుధవారం బొట్లగుండూరు పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని రక్షించి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అలుసు మల్లి ప్రభాకర్ చౌదరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**కనిగిరి:** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కనిగిరి పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గురువారం డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చెట్లను నరికి వేయడం వలన కాలుష్యం పెరిగి వాతావరణం దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.కొండయ్య, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

**టంగుటూరు:** టంగుటూరులో గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా సర్పంచి మద్దిరాల మమత మెక్కలు నాటారు. వీరి వెంట మాజీ సర్పంచి బెల్లం జయంతి బాబు, మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్ ఉన్నారు.. కారుమంచిలో సర్పంచి మన్నం శ్రీనివాస్, సీనియర్ టిడిపి నాయకులు ఈదర ప్రభాకరరావు, ఎం.నిడమాలూరులో కాకుమాని శ్రీకాంత్, ఐటిడిపి అధ్యక్షులు కాకుమాని శ్రీనివాస్, కటారి కోటయ్య, జయవరంలో యరమోసు సుధాకరబాబు మెక్కలు నాటారు.



పెద్దారవీడు కేజీబీవీలో మొక్క నాటుతున్న ఎరిక్షన్‌బాబు

**పెద్దారవీడు:** పెద్దారవీడు గ్రామంలోని కేజీబీవీలో గూడూరి ఎరిక్షన్‌బాబు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి చంద్రగుంట్ల నాగేశ్వరరావు, టిడిపి నాయకులు గొట్టం రామనారాయణరెడ్డి , షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**మార్కాపురం:** పచ్చని చెట్లు ప్రాణవాయువని మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భగా కోర్టు ఆవరణలో మొక్కలను గురువారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషితమైన వాతావరణంలో మనం ఉన్నామని, ఇలాంటి తరుణంలో మొక్కలు నాటాలని, వాటిని రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.కిశోర్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ అలిజహీర్, న్యాయవాదులు మధిరె మల్లికార్జునరెడ్డి, గెల్లి చౌడేశ్వరరావు, గుమ్మా వెలుగొండయ్య, జహీర్ సలాం, యేర్వ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**తసీఎస్‌పురం రూరల్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీశాఖ బోయమడుగుల బీట్ ఆఫీసర్ భారతి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముండ్లపాడు బీట్ ఆఫీసర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

**పొదిలి:** తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. దర్శి రోడ్డులోని గోశాలలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ పొదిలి కన్వీనర్ సూరెడ్డి శ్రీనివాసరెడ్డి, కో కన్వీనర్లు షేక్ రఫీ, ఎస్డి మహబూబ్ బాషల ఆధ్వర్యంలో మొక్కల నాటారు.

**శింగరాయకొండ:** శింగరాయకొండ ఎంపీడీవో డి.జయమణి పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటారు. ఎస్ఐ బి.మహేంద్ర, ఏపీవో సుభాషిని, మించల బ్రహ్మయ్య, చీమకుర్తి కృష్ణ, సుదర్శి ప్రసాదరావు, పామర్తి మాధవరావు, ఓలేటి రవిశంకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కొండలరావు పాల్గొన్నారు.

**పెద్దదోర్నాల:** కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అటవీక్షేత్రాధికారి ప్రసన్న జ్యోతి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్ర మంలో మెడికల్ ఆఫీసర్ శంకర్ రెడ్డి, సిహెచ్‌వో గౌస్ మొహిద్దిన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, భూమిని సర్పంచ్ చిన్న వెంకటమ్మ, ఐటిడిఏ కోఆర్డినేటర్ మంతన్న పాల్గొన్నారు.

**కొండపి:** మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణను కాపాడుకుంటూ జీవిద్దామని ఎంపీడీవో రామాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని కే.ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణ దినోత్సవ ఆవిర్భావం గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రామారావు, హైస్కూల్ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, కే.ఉప్పలపాడు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ప్రజాశక్తి-మద్దిపాడు**

మండలంలో 40 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ జయంత్ బాబు, జనసేన మండల అధ్యక్షులు నున్న బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీ మన్నం కిషోర్, సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## రాజేష్‌ని సన్మానించిన సత్య

**ప్రజాశక్తి-టంగుటూరు**



రాజేష్‌ని సత్కరిస్తున్న సత్య, అనగాని

తాడేపల్లిలోని ఆంధ్ర ప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక సదు పాయాల కార్పొరేషన్ కార్యాలయంలో ఎపిఈడబ్లుఐడిసి చైర్మన్ కుప్పం రాజేష్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేష్‌ని సత్కరించారు. ఈ సందర్భంగా సత్యా మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

## విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**ప్రజాశక్తి-పొదిలి**



కళ్యాణి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పొలంరెడ్డి కళ్యాణికి ప్రతిభ అవార్డు దక్కింది. ఈ విద్యార్థిని ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఓఏ గ్రూపులో 1000 మార్కులకు గాను 954 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వాసు దేవ్, మరియు ఓఏ అధ్యాపకులు రమణారెడ్డి, సుబ్బారెడ్డి, పద్మారావు కళ్యాణిని అభినందించారు. చింతగుంపల్లికి చెందిన తిరుపతిరెడ్డి, సుబ్బులు తమ కుమార్తెకు ప్రతిభా అవార్డు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 9న జరిగే అభినందన సభలో కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు.



రబ్బానీ ముస్కాన్

పొదిలి శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థి పొదిలి మసీదు తోటకి చెందిన షేక్ రబ్బానీ ముస్కాన్‌కి ప్రతిభ అవార్డు లభించింది. ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించింది. తల్లిదండ్రులు రషీద్, పర్వీన్ బాబీ, కళాశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు.

## పాఠశాలలో మెనూ పాటించాలి

**ప్రజాశక్తి-తాళ్ళూరు**

పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీలు మెనూ ప్రకారం భోజనం వండాలని ఎంఈవో-2 ఎల్.సుధాకర్ రావు అన్నారు. గురువారం మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ పాఠశాలలో కుక్ ఏజెన్సీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటకాలను రుచిగా చేసిన శివరాంపురం పాఠశాల వారికి మొదటి బహుమతి, వెలుగువారిపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలకు రెండో బహుమతి, తూర్పు గంగవరం జనరల్ పాఠశాలకు మూడో బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరావు, మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

## చిన్న సినిమాలకు మద్దతు ఇవ్వాలి

**దిల్‌రాజుతో ఎంఎన్ రెడ్డి**

**ప్రజాశక్తి-మార్కాపురం**



దిల్‌రాజుతో ఎంఎన్ రెడ్డి

చిన్న సినిమాలకు మద్దతు ఇవ్వాలని ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజును మార్కాపురం ప్రాంతానికి చెందిన సినీ నటుడు, డిఆర్‌యసిసి మాజీ సభ్యులు ఎంఎన్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్‌లో దిల్‌రాజును గురువారం కలిశారు. చిన్న సినిమాలు ప్రోత్సహించాలని కోరారు. ఆయన్ను కలిసిన వారిలో ఆర్‌వి మూవీస్ అధినేత రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**ప్రజాశక్తి-దర్శి**

గ్రంథాలయ అధికారి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వివిధ పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మొత్తం విద్యార్థులు 25 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి వి.విజయకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ లెక్చరర్ వివి.సుబ్బయ్య, బీడీసీఎల్ బి.కోటయ్య, టి.భూషణం, కొండారెడ్డి, సుజాత మరియు పాఠకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన కాంతారావు

**వీడ్కోలు సభలో డీఈవో కిరణ్ కుమార్**



టిఎల్ కాంతారావును సన్మానిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

ప్రధానోపాధ్యాయులు టిఎల్ కాంతారావు సేవలు ప్రశంసనీయమని డీఈవో ఏ.కిరణ్ కుమార్ అన్నారు. ఒంగోలులోని ఎం.హెచ్. ఆర్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన పదవీ విరమణ ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, దానికి కాంతారావు తన సేవలతో వన్నె తెచ్చారని పేర్కొన్నారు. జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు డి.వీరాంజనేయులు మాట్లాడుతూ కాంతారావు యుటిఎఫ్ సంఘ బాధ్యునిగా గతంలో విశేష సేవలను అభినందించారు. రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ టిఎల్ కాంతారావు ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షునిగా విశిష్ట సేవలు అందించారన్నారు. ఏపీ ఆల్ పెన్షనర్స్ అధ్యక్షుడు జి.శేషయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘ బాధ్యతలతో పాటు, విద్యా సేవలు అందించడంలో కాంతారావు కృషి చేశారన్నారు. జెవివి రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర రామారావు మాట్లాడుతూ కాంతారావు జెవివి కార్యకర్తగా, నాయకుడిగా విద్యార్థులలో శాస్త్ర విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలలో విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టియల్ కాంతారావు, సుజాత దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హై, నగర అధ్యక్షుడు సిహెచ్ లక్ష్మీనారాయణ, ఆల్ పెన్షనర్స్ సంఘం నాయకులు సింగరాజు వెంకట శ్రీనివాసరావు, బివి రావు, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు శ్రీరామ్ రెడ్డి, సుబ్బారావు, జిల్లా పరిక్షల అధికారి కోడూరు శివకుమార్, ఏపిటిఎఫ్ నాయకులు డి శ్రీనివాసరావు, ఒంగోలు డిప్యూటీడీఈవో చంద్రమౌడేశ్వర్, రిటైర్డ్ డిప్యూటీ డిఈఓ అనిత రోజు రాణి, ఎంఈఓలు డివిఎల్ నరసింహారావు, రమణయ్య, సరస్వతి, వెంక రెడ్డి, శివాజీ, జే సుబ్బారావు, రామిరెడ్డి, గోవర్ధన్, కే.శ్రీను, సరస్వతి, ప్రధానోపాధ్యాయులు బండి శ్రీనివాసరావు, భాస్కర శాస్త్రి, రాంబాబు, రంగారావు, సత్యవతి, ఒంగోలు గెలాక్సీ గ్రానైట్స్ అధినేత చలువాది బదరీ నారాయణ, హరిప్రియ గ్రానైట్ అధినేత నూనె వెంకటసుబ్రహ్మణ్యం, తాత వసంతరావు, తాత సుబ్బరత్తమ్మ, తాత కృష్ణ చైతన్య, తాత రాజేష్ కుమార్, తాత అలేఖ్య, తాత వచన్, తాత ఆధ్యా పాల్గొన్నారు.

# సహజ వనరుల పరిరక్షణపై అవగాహన

**ప్రజాశక్తి-పుల్లలచెరువు**

పుల్లలచెరువు మండలంలోని సుద్దకురవ తాండాలో నీటి భద్రత ప్రణాళికపై మూడు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ మరియు టాటా ట్రస్ట్ ఆధ్వర్యములో గురువారం ప్రారంభించారు. కొన్ని ఆటలు ద్వారా గ్రామంలోని నీటి వినియోగం, మనిషి మనుగడకు సహజ వనరుల పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లోని 40 గ్రామాలలో నీటి ప్రణాళికలు తయారు చేసి భూగర్భ జలాలను అధిక వినియోగాన్ని తగ్గించి నీటి సంరక్షణ పనులను చేపట్టి భూగర్భ జలాలను పెంచి గ్రామ అభివృద్ధికి కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి వెంకటేశ్వర నాయక్, ఎంపీటీసీ హనుమా నాయక్, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి మనోజ్, సెంటర్ ఫర్ మైక్రో ఫైనాన్స్ రాజస్తాన్ ప్రతినిధులు సాగర్ మోరే, ఆదిత్య, హనుమంతరావు నాయక్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి-టంగుటూరు**

నెల్లూరు జిల్లా జట్టుకు చిరికూరపాడు పాఠశాల బాలికలు ఎనిమిది మంది ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యయురాలు అనూరాధ తెలిపారు. ఎం.దీక్షిత, కె.గంగా భవాని, జి.భవ్య, పి.లిఖిత, పి.ధవిత, ఎం.షైనీ, కట్టా హేమలత, టి.సంజనలు ఎంపికయ్యారు. వీరు ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు నెల్లూరులో జరిగే సౌత్ జోన్ క్రికెట్ బాలికల పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు డి.అనురాధ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

# మార్కెట్ ధర ఇస్తేనే భూములు ఇస్తాం

ప్రజాశక్తి - సంతమాగులూరు

రెన్యూబుల్ ఎనర్జీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు కావలసిన భూములకు మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి రూ.30 లక్షల పైబడి ఇస్తేనే తమ భూములు ఇస్తామని రైతులు తేల్చి చెప్పారు. ఎంపిడిఒ సమావేశపు హాలులో చీరాల ఆర్డీఓ టి చంద్ర శేఖర నాయుడు అధ్యక్షతన కుందుర్రు, మామిళ్ళపల్లి, ఎస్ఎల్ గుడిపాడు రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు సంబంధించి 1500 ఎకరాల భూముల్లో సోలార్ ఎనర్జీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీనికి గత సమావేశంలో తమ భూములివ్వడానికి మామిళ్ళపల్లి రైతులు విముఖత వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులు భూములు ఇవ్వడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని అన్నారు. రెన్యూబుల్ ఎనర్జీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ డిఈ శివశంకర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఈ సోలార్ జోన్ రెండవదన్నారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేశాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సంబంధాలను ఉపయోగించి ప్రాజెక్టును మన ప్రాంతాని తీసుకొచ్చేలా ప్రయత్నం చారని అన్నారు. ఇది సోలార్ పార్క్ కాదని, సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేది కాదని, సోలార్ పరికరాల ఉత్పత్తికి ఏర్పాటు చేసిన ప్రత్యేక జోన్ అని అన్నారు. దీని ద్వారా శ్రీ సిటీ తరహాలో ఈ ప్రాంతం



మాట్లాడుతున్న చీరాల ఆర్డిఓ టి చంద్రశేఖర్ నాయుడు

వేగంగా అభివృద్ధి చెంది వేలాది మందికి ఉద్యోగాలు కల్పించేలా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న విభిన్న కంపెనీలు ఇక్కడ తమ ఉత్పత్తిని ప్రారంభిస్తాయని అన్నారు. ఈపాటికే రాయలసీమ జిల్లాల్లో ఈ ప్రాజెక్టు కోసం భూమిని గుర్తించారని అన్నారు. కానీ మంత్రి గొట్టిపాటి ఒత్తిడి మేరకు ఈ ప్రాంతంలో ఏర్పాటుకు ముందుకు వచ్చాయని అన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ రేటు ఎకరానికి రు.5.50 లక్షలు ఉందని, మార్కెట్ రేటు రూ.15 లక్షలు పైబడి ఉందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు కలిపి ఇవ్వాలని, లేదంటే కనీసం ఎకరానికి రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు కె రవిబాబు, బల్లికురవ తహశీల్దారు రవి నాయక్, సంతమాగులూరు ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని తూర్పు వీరయపాలెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమాన్ని కెవికె నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. డాక్టర్ ఎస్‌వి రమణరావు, ప్రధాన శాస్త్రవేత్త, కెవికె నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏవిధంగా శాస్త్రవేత్తల సలహాలతో చేసుకోవాలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి తెలిపారు. డాక్టర్ టి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎఒ వి బాలకష్ణనాయక్ మాట్లాడుతూ ఈ పంట నమోదు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ శాఖల అధికారులు, తూర్పు వీరయపాలెం సర్పంచ్, ఎంపిటీసీ పాల్గొన్నారు.

**చీరాల :** రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంచుకొని అధిక పంట దిగుబడి పొందాలని ఎఒ సుమతి సూచించారు. మండలంలోని చీరాలనగర్, కొత్తపాలెం గ్రామాల్లో రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది జూన్ మొదటి వారమే సాగర్ నీళ్లు విడుదల చేస్తున్నందున వరి పైరు సాగు చేసే రైతులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎలు లావణ్య, బబ్లెభా పాల్గొన్నారు.

**చెరుకుపల్లి :** రైతులు వేసవిలో దుక్కులు దున్నుకొని ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ రైతులకు తెలిపారు. సాగుకు సన్నద్ధంపై రైతులకు అవగాహన కల్పించారు. 50శాతం సబ్సిడీపై బిపిటి 5204 విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు కలియ దున్నే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కౌలు రైతు కార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఇఒ, విఎఎలు పాల్గొన్నారు.

**వేమూరు :** మండలంలోని వేమూరు, కుంచెల్లపాడు గ్రామాల్లో గురువారం సాగు సమయాత్తం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సిహెచ్ సునీత మాట్లాడుతూ మట్టి నమూనా తీసి ల్యాబుకు పంపి పరీక్షల రిపోర్టు ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో విఎఎలు ప్రమీల, జీవమని పాల్గొన్నారు.

## జార్జి ఫార్మసీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక జార్జి ఫార్మసీ కళాశాలలో ఓమెగా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతమైంది. విద్యార్థుల ఎంపిక కోసం లిఖిత పరీక్షలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఓమెగా హెల్త్‌కేర్ సంస్థ హెచ్ఆర్ మనోజ్‌కుమార్ నిర్వహించారు. 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై జయరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రేష్ఠమైన ఉపాధి అవకాశాలు అందించడమే మా కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు.

## డివైడర్‌ను ఢీకొని తిరగబడ్డ లారీ

ప్రజాశక్తి - పంగులూరు

ఒంగోలు వైపు నుండి విజయవాడ వెళుతున్న మామిడి కాయలు లారీ ముప్పవరం ఫ్లై ఓవర్ దగ్గరకు రాగానే అదుపు తప్పి ఒక్కసారిగా డివైడరును గుద్దుకుంది. వెంటనే సర్వీస్ రోడ్డులో బోల్తా పడింది. ఆ సమయంలో ఆ లారీ డ్రైవర్ షేక్ తాజుద్దీన్ ఉన్నాడు. అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాద స్థలానికి హైవే అంబులెన్స్ సిబ్బంది చేరుకుని లారీని ప్రక్కకు తీశారు.

## వంట నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి - కంభం రూరల్

పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులకు ఒకరోజు శిక్షణ ముగింపు సందర్భంగా ఎంఈఓ మాల్యాద్రి మాట్లాడారు. టాటా ట్రస్ట్ సహకారంతో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ వీరభద్రాచారి పలు సూచనలిచ్చారు. డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ టి రంగారావు, ప్రోగ్రాం అసోసియేట్ చెన్ను దివ్యశ్రీ రుచి, నాణ్యత, పరిశుభ్రత అంశాల్లో మెళకువలు నేర్పించారు. వంటల పోటీలు నిర్వహించి గని వెంకటయ్య స్మారక గ్రంథాలయం ద్వారా విజేతలకు బహుమతులు అందించారు. ఎంఈఒలు టి శ్రీనివాసులు, బి అమూల్య పాల్గొన్నారు.

## ముగిసిన లాసెట్, ఎడ్ సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎపి లాసెట్, ఎడ్ సెట్ పరీక్షలు గురువారం నిర్వహించినట్లు సెక్రటరి వనమా రామకృష్ణారావు, శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం పర్యవేక్షణలో ఎపి లా సెట్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పర్యవేక్షణలో ఎపి ఎడ్ సెట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

## మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

మండలంలోని అమానుగుడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన పల్లెపోగు సింహాద్రి (13) అనే విద్యార్థి ఈతకు వెళ్లి చెరువులో మునిగి మృతి చెందాడు. ఆ కుటుంబం పేదరికంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నేత డాక్టర్ మన్నె రవీంద్ర గురువారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాగా చదువుకుంటున్న విద్యార్థి సింహాద్రి చెరువు దగ్గరకు ఈదకు వెళ్లి మరణించడం బాధాకరమన్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

## మేలైన విత్తనాలు ఎంచుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

వ్యవసాయ రంగంలో విత్తనాల ప్రాముఖ్యత ఎంతో ముఖ్య మైనదని ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి సంధ్యారాణి అన్నారు. విత్తన దినోత్సవ సందర్భంగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, మహిళలకు విత్తనాల విధి విధానాల గురించి సలహాలు ఇచ్చారు. రైతులు మేలైన విత్తనాలను ఎంచుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. విత్తనాలు కొనేటప్పుడు బిల్లులు తప్పని సరిగా తీసుకోవాలని కోరారు. ఎల్ఆర్‌జి52 కంది రకం, టిబిజి 104 మినుము రకాలు వాడాలని సూచి చారు. కార్యక్రమంలో ఎఒ బి బాలకష్ణనాయక్ పాల్గొన్నారు.

## 'ఇష్టకామేశ్వరి'లో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల ఇష్టకామేశ్వరి చెంచు గూడెంలో పాలుట్ల వైద్యాధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెంచు గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులతో బాధ పడుతున్న వారికి ప్రత్యేక చికిత్స అందించారు. గర్భిణీలు, చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. రక్తహీనతతో బాధ పడుతున్న వారికి ఐరన్ టానిక్‌లు, ప్రొటీన్ పౌడర్లు, ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్య విద్యను బోధించారు. కార్యక్రమంలో డాక్టర్ పాల్, వైద్య సిబ్బంది జానారెడ్డి, నలగాటి వెంకట్రామయ్య నాయుడు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వీధిలైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - కొమరోలు



లైట్లు ఏర్పాటు చేయిస్తున్న ఎఎంసి డైరెక్టర్ షేక్ హసీనా

తన స్వగ్రామమైన మండలంలోని హనుమంత రాయుని పల్లెలో గిద్దలూరు ఎఎంసి డైరెక్టర్ షేక్ హసీనా తన సొంత నిధులతో వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. అంధ కారంలో ఉంటున్న ప్రజలకు చీకటి నుంచి విముక్తి కలిగించాలనే ఆలోచనతో తన సొంత నిధులతో 14 వీధి లైట్లను కొనుగోలు చేసి ఎలక్ట్రీషి యన్ సహకారంతో ఏర్పాటు చేయించారు. గ్రామ ప్రజలు ఆమెను అభినందిస్తున్నారు. శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటీసీ ముతుముల సంజీవరెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి తాను కృషి చేస్తానని తెలిపారు.

## ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు గురు వారం ముగిశాయి. ఎంఈఓ పి ఆంజనేయులు క్విజ్, వ్యాసరచన, చదరంగం, డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ పాల్గొన్నారు.

## శ్రీసీతారామ విగ్రహ ప్రతిష్టలో డాక్టర్ లక్ష్మీ

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని దేవవరం పంచాయతీలోని శేషంవారి పాలెంలో శ్రీ సీతారామ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, టిడిపి నాయకులు సానే సుబ్బయ్య, గణపతి, అంకయ్య హాజరై తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు

ప్రజాశక్తి-మార్కాపురం

రాక్షస పాలన ముగిసి సుపరిపాలనకు ఏడాది పూర్తయిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని భూపతిపల్లిలో కూటమి సర్కార్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గొలమారి నాసరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సంబరాల్లో ఆయన మాట్లాడారు. కేక్‌ను కట్ చేశారు. అనంతరం గ్రామంలో 400 మొక్కలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మొక్కను నాటారు. వన మహోత్సవంలో అటవీశాఖ అధికారులు లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్త చేశారు. అటవీశాఖ అధికారుల గైర్హాజరుపై డిప్యూటీ సిఎం, అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వైసిపి నేతలతో సోషల్ ఫారెస్ట్ అధికారులు కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ వారు వద్దంటే వన మహోత్సవంలో పాల్గొనలేదని ఆరోపించారు. అటవీ శాఖ అధికారులు తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

## దేవస్థాన భూముల కౌలు వేలం

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

కొమరోలు గ్రామంలోనని శ్రీ రామాంజనేయ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంకు సంబంధించిన కొమరోలు, సూరవారిపల్లి, నల్లగుంట్ల, కృష్ణంపల్లి గ్రామాల్లోని 14.04 ఎకరాలు, గిద్దలూరు మండలం నరవ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంకు సంబంధించి నరవ, ఎన్ బయనపల్లె గ్రామాల్లోని 6.95 ఎకరాల భూములకు 2025 – 28 వరకు మూడేళ్ల కాలం కౌలుకు భూములు సాగు చేసుకునేందుకు జూన్ 9న కొమరోలు శ్రీ రామాంజనేయ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆవరణలో, అదేరోజు మధ్యాహ్నం నరవ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణ ఆవరణలో దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో గిద్దలూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఇఒ చిక్కుడు శ్రీనివాసులు అధ్యక్షతన కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.2వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

## కమ్యూనిస్టు పాలనతోనే పేదలకు న్యాయం

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

కమ్యూనిస్ట్ పాలనతోనే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. స్థానిక ముస్లిం షాదీఖానాలో సీపీఐ నియోజకవర్గ 4వ మహాసభ గురువారం నిర్వహించారు. సభకు పూర్ణకంటి తిరుమలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు నిర్వహించే కార్యక్రమాలు జనంలోకి వెళ్లాయని అన్నారు. తద్వారా పాలకవర్గాలకు బుద్ధి చెప్పడానికి అవకాశం వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, దేవండ్ల శ్రీనివాస్, జి గురునాథం, కెవి కృష్ణగౌడ్, ఎం సాంబశివరావు, దాసరి మల్లికార్జున, బాణాల రామయ్య, నక్కా తిరుపతయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సభ్యునిగా 'జావీద్ అన్వర్'

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సభ్యునిగా పట్టణానికి చెందిన న్యాయవాది సయ్యద్ జావీద్ అన్వర్ నియమితులు అయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జావీద్ అన్వర్ ఈ పాటికే నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ డాక్టర్ సిరివెళ్ల ప్రసాద్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్‌రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

బక్రీద్ పండుగ మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డిఎస్పి ఎ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం సమావేశం నిర్వహించారు. పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జరుపు కోవాలని సూచించారు. కమీషనర్ కె సాంబశివరావు, సిఐ ఎ మల్లికార్జునరావు, ఎ రామచంద్ర రావు, షేక్ జమీర్, సలీమ్ ఖాన్, షేక్ మొహిద్దీన్, షేక్ లియాఖత్ భాష, సయ్యద్ తయ్యబ్, పిన్ని సాంబశివరావు, వి శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**ప్రజాశక్తి - అద్దంకి**

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోర్టు భవనాల ఆవరణలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి అఖిల, న్యాయవాదులు గురువారం మొక్కలు నాటారు. కోర్టు నుండి అంబేద్కర్ విగ్రహం మీదగా బంగ్లా రోడ్, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వరకు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడవల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గృహలక్ష్మి, సీనియర్ న్యాయ వాదులు పిఎల్ఎన్ ప్రసాద్, వి సుబ్రహ్మణ్యం, పి సతీష్, పి రమణయ్య, పి ఉదయ భాస్కర్, కరి రామకృష్ణరావు, గంగాధర్, జి అంజిరెడ్డి, పుల్లారెడ్డి, శానం నాగేశ్వరరావు, కాకాని శ్రీహర్ష భాస్కరరెడ్డి, టి మార్తా శ్రీనివాసరావు, ఆకుల సత్యవతి, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

**పర్చూరు :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని తహశీల్దారు బ్రహ్మయ్య అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటారు. భూమి కాలుష్యం పెరిగి ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయని అన్నారు. రాబోయే తరాలకు మంచి వాతావరణ పరిస్థితులు కల్పించడానికి భూమిని పరిరక్షించేందుకు మొక్కలు సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో డిటి సంధ్యారాణి, రీ సర్వే డిటి అరుణ పాల్గొన్నారు.

**వేటపాలెం :** సెయింట్ ఆన్స్ ఫార్మసీ కాలేజీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ప్లాస్టిక్ పొల్యూషన్‌పై పోరాటం అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వివి. నాగేశ్వరరావు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఒడి టి కిరణ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో బి వినయ్ కుమార్, ఆర్‌వి రమణమూర్తి పాల్గొన్నారు.

**వేమూరు :** పర్యావరణ దినోత్సవం సందర్భంగా తహశీల్దారు సుశీల గురువారం తహశీల్దారు కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

**భట్టిప్రోలు :** స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, తహశీల్దారు మేక శ్రీనివాసరావు గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఒ జలజ, ఈఒపిఆర్డి ఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**చీరాల :** మొక్కల పెంపకం అందరి బాధ్యతని, ప్రకృతి లేనిదే జీవుల మనుగడ లేదని తెలుగు యువత నాయకులు గౌరీ అమర్నాథ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మానవ హారం, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, మొక్కలు పంపిణీ వంటి కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రషీద్, డిఈ రఘురాం పాల్గొన్నారు.

**సంతమాగులూరు :** ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల్లో వేడి పదార్థాలు తినడం, త్రాగడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ డి సుధ తెలిపారు. స్థానిక చర్చి సెంటర్లోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుష్మారాణి పాల్గొన్నారు.

**వేటపాలెం :** సకల ప్రాణుల మనుగడకు ప్రకృతి ఎంతో ఆవశ్యకమైనదని ఎంపిడిఒ మేడబలిమి రాజేష్ బాబు అన్నారు. స్థానిక బిబిహెచ్ కాలేజ్ నందు మానవ హారం, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మోహన్ రంగా, స్కూల్ కరెస్పాండెంట్ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం, తెలుగుదేశం నాయకులు దొగిపర్తి బాలకృష్ణ, నాగు, సజ్జ కోటేశ్వరరావు, సుభాని రాజేష్ పాల్గొన్నారు.

**యద్దనపూడి :** స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు గురువారం మొక్కలు నాటారు. తహశీల్దారు రవి కుమార్ మాట్లాడుతూ అడవుల విస్తీర్ణం తగ్గుతుందని, దాని ఫలితంగా వాతావరణంలో మార్పులు వచ్చి భూమి మీద ఉష్ణోగ్రత పెరుగుతుందని అన్నారు. ఎంపిడిఒ జావేద్ మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటి పెంచి భవిష్యత్తు తరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని అందించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పిటివి కృష్ణ, ఎపిఒ, డిటి విష్ణు పాల్గొన్నారు.

**రేపల్లె :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆర్డీఒ నేలపు రామలక్ష్మి కోరారు. పట్టణంలోని పెనుమూడి రోడ్డులో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ కె సాంబశివరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పాల్గొన్నారు.

**గిద్దలూరు :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వన మహోత్సవం' గురువారం పట్టణంలోని జెడ్‌పి బాలుర పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. కార్యక్రమంలో గిద్దలూరు ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి, తహశీల్దార్ ఎం అంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, ఎఎంసి చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్, కౌన్సిలర్లు బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, లొక్కు రమేష్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగం కావాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె భరత్ చంద్ర కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాలుగుళ్ల శేషశయనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ తిరుమలప్రసాద్, ఉపాధ్యక్షులు బొద్దు ప్రకాష్, న్యాయవాదులు ఎస్‌వి భాస్కరరావు, కె హిమశేఖర్‌రెడ్డి, యు మల్లిఖార్జునరావు, చల్లగాలి పోలయ్య, కటారు పోలయ్య, డి సిద్దయ్య, జె రంగమోహన్, వి బాలకృష్ణ, ఎపిపి కె అరుణకుమారి, అద్దంకి మధుసూదనరావు పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్య కరమైన జీవన వాతావరణం అందించాలన్న దిశగా ముందడుగు వేయాలని టిడిపి ఇంచార్జి గూడూరు ఎరిక్షన్ బాబు అన్నారు. వైద్యశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా, గంజివారిపల్లి ఎఫ్ఆర్వో ఎస్‌వి సుబ్బారావు, ఎండిపిఒ బండారు శ్రీనివాసులు, ఎంఈఒలు అంజనేయులు, మల్లు నాయక్, ఎపిఒ శైలజ, ఎస్‌సీసీ ఆఫీసర్ సత్యనారాయణ, టిడిపి నాయకులు చేకూరి సుబ్బారావు, చిట్టేల వెంగళరెడ్డి, బివి సుబ్బారెడ్డి, మంత్రూ నాయక్, కంచర్ల సత్యనారాయణ గౌడ్, శనగా నారాయణరెడ్డి, పెరుమాళ్ల మల్లికార్జున పాల్గొన్నారు. మొక్కలు నాటారని ఎంఇఒ ఆంజనేయులు తెలిపారు. జడ్పి హైస్కూల్ హెచ్ఎం నాగరాణి, చెన్నకేశవస్వామి, ఉపాధ్యాయులు శేషారావు, పోలమ్మ, యోగా నాయక్, తిరుపతి నాయక్, ర్యూన్సీ పాల్గొన్నారు.

**దర్శి :** ఇటీవల నూతనంగా ప్రారంభించిన ఎంఎస్ఎంఇ పార్క్ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఎపిడి లలిత కుమారి, టిడిపి మండల అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ టిడిపి అధ్యక్షులు చిన్నా పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రేపల్లె ఆర్డీఒ రామలక్ష్మి



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న డిడి నిషాకుమారి

## స్త్రీ నిధి డబ్బులతో యానిమేటర్ పరారీ

**ప్రజాశక్తి - సంతమాగులూరు**

స్త్రీ నిధి డబ్బులతో పరారైన విలేజి యానిమేటర్‌పై చర్యలు తీసుకొని రికవరీ చేయాలని మండలంలోని సజ్జాపురం డ్వాక్రా మహిళలు వెలుగు కార్యాలయంలోని అధికారులతో వాగ్వాదానికి దిగారు. 2022 నుండి సజ్జాపురంలోని 8గ్రూపులకు చెందిన మహిళలు తాము తీసుకున్న స్త్రీ నిధి రుణాలు ఎప్పటికప్పుడు గ్రామానికి చెందిన విఒఎ దోమతోటి అనురాధకు అందజేశామని తెలిపారు. ఆమె మహిళల నుండి తీసుకున్న రుణాలను సంతమాగులూరు కెనరా బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా తన సొంత బ్యాంకు ఖాతాలో జమ చేసుకుందని తెలిపారు. తరువాత తీసుకున్న రుణాలు గడువు ముగియడంతో బ్యాంకు వారు డ్వాక్రా మహిళలకు నోటీసులు పంపారు. దీంతో ఖంగు తిన్న మహిళలు యానిమేటర్ గ్రామంలో లేదని, రూ.10.10లక్షలతో పరారైందని తెలుసుకున్నారు. స్త్రీ నిధి రుణాల డబ్బులతో పరారైన యానిమేటర్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. దీంతో వెలుగు ఎపిఎం టి హనుమంతరావు మోసపోయిన ప్రతి డ్వాక్రా మహిళల నుండి ఫిర్యాదు తీసుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కోన రఘుపతి

## 'వైద్య కళాశాల'పై బాధ్యతారాహిత్యం

**ప్రజాశక్తి - బాపట్ల**

స్థానిక వైద్య కళాశాల నిర్మాణంపై స్థానిక శాసన సభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ దృష్టి పెట్టకుండా బాధ్యతరహిత్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి ఆరోపించారు. తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య కళాశాల నిర్మాణంపై అవసరమైతే ముఖ్యమంత్రిని వివిధ పార్టీల నాయకులను తీసుకెళ్లి అడగాలి కదా అని అన్నారు. స్థానిక శాసన సభ్యుడు ఒక రోడ్డు వేసి ఆర్భాటాలు, బడాయి తప్ప మరొకటి లేదని అన్నారు. ఏడాదిలో తెలుగుదేశం వేసిన రోడ్ల కంటే మూడింతలు రోడ్లు తాము వేశామని అన్నారు. మెడికల్ కాలేజీ ప్రజల కోసమే కదా? అవి కడితే తనకు ఏమైనా వస్తుందా అని ప్రశ్నించారు. సమావేశంలో చేజర్ల నారాయణరెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నక్క వీరారెడ్డి పాల్గొన్నారు.

## ప్రతిభ అవార్డుకు ఎంపికైన విద్యార్థులు

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు వచ్చినట్లు ఎంఇఒ పి లాజర్ తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో గూడవల్లి వనజ చంద్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉండగా, 5వ స్థానంలో గొల్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి, 6వ స్థానంలో కావూరు ఎపి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని ఎంపికయ్యారు. వనజ చంద్ర విద్యార్థులు తోట సాయి జస్వంత్, పగడం పవన్ కుమార్‌రెడ్డి, చందవోలు లక్ష్మీ ప్రియ, సొంటి షణ్ముఖ చైతన్య, గుళ్లపల్లి విద్యార్థి షేక్ అఫ్రీన్, గురుకుల పాఠశాల విద్యార్థి మెరజ్యోతు శివలక్ష్మి బాయి ఎంపికైనట్లు తెలిపారు.



శ్రీమంతంలో పాల్గొన్న సూపర్వైజర్ లీలావతి

## పిల్లల ఆరోగ్యమే దేశ సంపద

**ప్రజాశక్తి - వేటపాలెం**

పిల్లల ఆరోగ్యమే దేశ సంపదని ఐసిడిఎస్ వేటపాలెం ప్రాజెక్ట్ సూపర్వైజర్ ఎస్ లీలావతి అన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుధా, అంజనాదేవి, ఆయా లలిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వరరావు

## గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు మంజూరు చేస్తుందని, దీని దృష్ట్యా ప్రతి ఒక్కరు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావాలని పిడి వై వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పిఎంఎవై ఎన్‌టిఆర్ కాలనీల్లో లబ్ధిదారులు ఈ వేసవిలో గృహ నిర్మాణాలు చేపట్టుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలకు పెంచిందని అన్నారు. గ్రామాల వారీగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరితగతన పూర్తి చేసేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారామయ్య, ఎంపిడీఒ ఎస్ వెంకటరమణ, ఏఈ సౌమ్య రేవతి, వర్క్ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



కంటి ఆపరేషన్లు చేయించుకున్న బాధితులు

## 140మందికి శుక్లాల ఆపరేషన్లు

**ప్రజాశక్తి - పంగులూరు**

రోటరీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఈ నెలలో 140 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి చేసినట్లు రోటరీ క్లబ్ ఐ కేర్ రీజనల్ చైర్మన్ చిలుకూరు వీర రాఘవయ్య గురువారం తెలిపారు. మొదటి విడత 100మందికి, 40మందిని రెండోవిడతలో బుధవారం సాయంత్రం ఆపరేషన్ చేసి గురువారం సాయంత్రానికి ఆసుపత్రి బస్సులోనే పంగులూరు చేర్చినట్లు తెలిపారు. ఇప్పుడు ఆపరేషన్ చేయించుకున్న వారికి జులై నెలలో ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని అన్నారు. ప్రతి నెల చివరి శనివారం కంటి వైద్య శిబిరం స్థానిక రోటరీ భవన్ వద్ద జరుగుతుందని తెలిపారు.

## బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

**ప్రజాశక్తి - పంగులూరు**

మార్టూరు నుండి వసంత కృష్ణ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై అద్దంకి వెళుతుండగా జాగర్లమూడి వారిపాలెం దాటిన తర్వాత వెనుకగా వస్తున్న గుర్తు తెలియని ఒక మోటార్ సైకిల్ ఢీ కొట్టి వెళ్ళిపోయింది. ప్రమాదంలో వసంత కృష్ణ కింద పడిపోయి ఎడమ కాలు యాంకిల్‌పైన ఎముక విరిగింది. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని వైద్యం కోసం ఒంగోలు వెంకటరమణ హాస్పటల్‌కు తరలించారు. రేణింగవరం ఎస్ఐ కేసు నమోదు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - చీరాల**

నేడు పట్టణంలోని దండుబాట సబ్ స్టేషన్‌లోని విఠల్ నగర్ ఫీడర్‌లో మరమ్మత్తుల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఈ హరి ప్రసాదరావు తెలిపారు. విఠల్ నగర్, హరిప్రసాద్ నగర్, విజిలిపేట, బాలాసాయి నగర్, వైకుంఠపురం, స్వర్ణ రోడ్, ఫైర్ ఆఫీసు రోడ్డు వినియోగదారులు సహకరించాలని కోరారు. టౌన్ సబ్ స్టేషన్ విద్యుత్ లైన్ల మరమత్తులు కారణంగా ఉదయం 7 నుండి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ముంతవారి సెంటర్, కూరగాయల మార్కెట్, తహశీల్దారు కార్యాలయం, గడియారపు స్తంభం సెంటర్, తెల్ల గాంధీ బొమ్మ సెంటర్‌లోని ప్రజలు సహకరించాలని కోరారు.

# బాపట్లలో పి-4 విధానం అమలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



పేద కుటుంబానికి చెందిన విద్యార్థికి పాఠశాలలో అడ్మిషన్ ఇప్పిస్తున్న మార్గదర్శి, అధికారులు

పి-4 విధానం అమలు కార్యకలాపాలు బాపట్ల జిల్లాలో మొదలయ్యాయి. బంగారు కుటుంబాలలోని లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి ప్రత్యేక చొరవ చూపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి-4 విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బాపట్ల జిల్లా నుంచి ప్రారంభించారు. ఏప్రిల్ నెలలో బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా పర్చూరు నియోజకవర్గ చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో పి-4 విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో చిన్నగంజాం మండలం చిన్నగొల్లపాలెం గ్రామంలోని యల్లావుల అంకమ్మ భర్త వెంకట్రావు మతి చెందడంతో ఆ కుటుంబం దయనీయస్థితిలోకి వెళ్లిపోయింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన మార్గదర్శి విక్రమ నారాయణ అదే మండలానికి చెందిన వారు. యల్లావుల అంకమ్మ కుమారుడు యల్లావుల గణేష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా ఉన్నత విద్యా ఫలాలను అందించడానికి మార్గదర్శి కుటుంబం చేయూతనందించింది. ఉప్పుగుండూరులోని ఆక్స్ ఫోర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 9వ తరగతి విద్యనభ్యసించడానికి బాలుడు గణేష్ని చేర్పించారు. మార్గదర్శిగా ఉన్న విక్రమ నారాయణ ఆ పాఠశాలకు రూ.50 వేల ఫీజును చెల్లించి ప్రభుత్వం చేపట్టిన పి-4 విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో మార్గదర్శి విక్రమ నారాయణను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రత్యేకంగా అభినందించారు.

# మెగా డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మెగా డీఎస్సీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిగావించినట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం నాడు జిల్లాలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, లైజనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. అత్యవసర సమాచారం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్కు సంబంధించి నలుగురు సహాయకులను నియమించామన్నారు. డీఈవో కార్యాలయంలో మెగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. సమస్యలు ఉన్నట్లయితే పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్ సెల్ నెంబర్ 8125264606 ను సంప్రదించాలని డిఇఒ కిరణ్కుమార్ సూచించారు. కమాండ్ కంట్రోల్ సహాయకులుగా ఎస్కే మధురాభి నెం.9441991757, సిహెచ్ నవ్య 89776 90457, నవ్య రోహిణి 7989416703, ఎస్.హర్షిక 7416109602ను సంప్రదించాలని కోరారు.

### విద్యాబోధనలో

# నూతన పద్ధతులు అమలు చేయాలి

### డిఇఒ కిరణ్కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న డిఇఒ కిరణ్కుమార్

విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులు అందిపుచ్చుకొని నాణ్యమైన విద్య అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.కిరణ్కుమార్ సూచించారు. గురువారం నాడు ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా రిసోర్స్పర్సన్ మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖలో చోటు చేసుకున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు, ఉత్తమ విద్యా ఫలితాలు రాబట్టేందుకు శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డిసిఇబి సెక్రటరీ మర్రి శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎస్ సుబ్బారావు, రాష్ట్ర పరిశీలకులు ఎం.చంద్ర శేఖర్, డైట్ సీనియర్ లెక్చరర్ బి.తిరుపతయ్య, పి.రమేష్ పాల్గొన్నారు.

# పరిశ్రమలకు రూ.5.72 కోట్ల రాయితీ విడుదల

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాను పారిశ్రామికంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి కోరారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిశ్రమల ఎగుమతుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలో పరిశ్రమల కోసం 202 దరఖాస్తులు చేసుకోగా కమిటీ పరిశీలించి దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 186 పరిశ్రమలకు రూ.5.72 కోట్ల రాయితీ సొమ్ము మంజూరైనట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రాధాన్య రంగాలకు సంబంధించిన వార్షిక పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వై.రామకృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, నాబార్డు డీడీఎం రవికుమార్, ఎల్ డి యం శివకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఫ్యాప్సియా సభ్యులు భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయపాటి జగదీష్

# సౌత్లో సుప్రీంకోర్టు బెంచ్ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దక్షిణ భారతదేశంలో సుప్రీంకోర్టు బెంచ్తో పాటు రెండవ పార్లమెంట్ను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జెఏసి రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు, ఒంగోలు సంతపేటలోని సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో రెండవ పార్లమెంటును ఏర్పాటు చేసి శీతాకాల సమావేశాలు జరిపేలా చూడాలని కోరారు. వాటితో పాటుగా ఆర్బిఐ అనుబంధ బ్యాంకులలో సిబిల్ స్కోర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరుతో జాతీయ సహకార బ్యాంక్ను ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన జాగృతి రాష్ట్ర అధ్యక్షులు రెబ్బవరపు ప్రేమ్ కుమార్, జాగృతి ఉపాధ్యక్షులు బత్తుల సుబ్బయ్య, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, విద్యార్థి యువజన నాయకులు రాజీవ్, సూర్య సాగర్, కృష్ణ, బెంజిమెన్ పాల్గొన్నారు.

## అదనపు పని గంటల తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు సుబ్బారావు


ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్ర మంత్రివర్గం కార్మికవర్గ పనిగంటల సమయాన్ని పెంచుతూ చేసిన తీర్మానాన్ని ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి కార్మిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల సిఐఐ సదస్సులో మాట్లాడుతూ సంపద సృష్టికర్తలు పారిశ్రామికవేత్తలు అనే వ్యాఖ్య వెనుక ఇదే అంశం దాగుందన్నారు. సంపద సృష్టికర్తలు కార్మికులయితే, వక్రీకరించి చేసిన వ్యాఖ్యలు కార్మికుల మనోభావాలను దెబ్బ తీసేవిగా ఉన్నట్లు తెలిపారు. మహిళలు రాత్రి పూట కూడా పనిచేయవచ్చని తీర్మానం చేయడం పట్ల తీవ్రంగా విమర్శించారు. నూటికి 99.9 పరిశ్రమలలో మహిళలకి పని ప్రదేశంలో సరైన రక్షణ లభించట్లేదన్నారు. ప్రతి పరిశ్రమలో సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని చేసిన తీర్మానం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం తన చర్యలను వెనక్కి తీసుకోకపోతే కార్మిక వర్గాన్ని కూడగట్టి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## నేడు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉమ్మడి ప్రకాశం జిల్లా లో ఎస్ జి టి, పిఇటి నుంచి ప్రమోషన్ పొందిన స్కూల్ అసిస్టెంట్, పి ఎస్ హెచ్ ఎంలకు శుక్రవారం నాడు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక డిఆర్ఆర్ఎం మున్సిపల్ స్కూల్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. అర్హులైన వారి సీనియారిటీ జాబితా రూపొందించామని, ఆ జాబితా ప్రకారం వారి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తి చేసామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, జిల్లా పరిషత్ పాఠశాలల్లో, మున్సిపల్ యాజమాన్యంలోని పాఠశాలలో కార్పొరేషన్ యాజమాన్యంలోని పాఠశాలల్లో మొత్తం 432 ఖాళీలకు కౌన్సిలింగ్ ప్రక్రియ ఒంగోలులోని డిఆర్ఆర్ఎం పాఠశాలలో జరుగుతుందని అర్హులైన వారందరూ సర్వీస్ రిజిస్టర్, సర్టిఫికెట్లతో సకాలంలో హాజరు కావాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, కలెక్టర్ అన్సారియా

# ప్రకృతిని కాపాడుకుంటేనే మానవ మనుగడ

### రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రకృతిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ పి.కృష్ణయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రోత్ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మన ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండాలంటే మనం పీల్చుకునే గాలి స్వచ్ఛమైనదిగా ఉండాలని అన్నారు. పచ్చదనాన్ని పెంచుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకుంటేనే స్వచ్ఛమైన గాలి మనకు లభిస్తుందన్నారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కలు పెంచడమే పరిష్కారమని అన్నారు. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డ్వామా పి.డి. జోసఫ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ. రాఘవరెడ్డి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, టిడిపి మండల అధ్యక్షులు మండవ జయంత్బాబు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు మండవ రత్నాకర్, కె.భాస్కర రావు, జి వీరభద్రాచారి పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

### బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



మొక్క నాటుతున్న ఎంపీ, కలెక్టర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలం సూర్యలంక దగ్గర నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఆప్కో చైర్మన్ సజ్జల హేమలత, జిల్లా అటవీ శాఖ అధికారి కె. వినోద్ కుమార్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్లమెంటు సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు నగరవనంలో చెట్లను నాటారు. అనంతరం జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులకు, అధికారులకు అటవీ శాఖ వారు జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, స్వయం సహాయక గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

### విద్యా సంస్కరణలను

# క్షేత్రస్థాయిలో అమలుచేయాలి

### డిఇఒ పురుషోత్తమరావు

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న డిఇఒ పురుషోత్తమరావు

ఈ ఏడాది ప్రభుత్వం పాఠశాల విద్యా విధానంలో నూతనంగా చేర్చిన విద్యాసంస్కరణలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా రిసోర్స్ పర్సన్లు విశేషంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.పురుషోత్తమరావు అన్నారు. గురువారం డిఆర్సిలకు పట్టణంలో ఎస్ఎంఇ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల మూడు నుండి 5వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లాలో 106 మంది డిఆర్పిలను వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి సి ఆర్ పి ల ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణలో భాగంగా పాఠ్యపుస్తకాల అభివృద్ధి, అకాడమిక్ క్యాలెండర్, అసెస్మెంట్ బుక్లెట్స్, క్లస్టర్ కాంప్లెక్స్లు ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్, హెచ్ పిసి ,లీప్ యాప్,దీక్షా,కరికులం డెవలప్మెంట్, టీచ్ టూల్ తదితర అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈనెల9 ,10 ,11 తేదీల్లో జరిగే డివిజన్ స్థాయి శిక్షణలో పై అంశాల పై జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు విద్యాశాఖ ఆయన తెలిపారు. కార్యక్రమంలో మైనంపాడు డైట్ నుండి వచ్చిన సీనియర్ లెక్చరర్స్ సర్దార్ పాపారాయుడు, విజయకృష్ణ, డిసిఇబి కార్యదర్శి ప్రసాద్, ప్రత్యేక పరిశీలన అధికారి ఉప్పాల శివలక్ష్మి, పాల్గొన్నారు.